# 14

# సురక్షితముగా జీవించుట

## (6:19-34)

6:19–34లో, దేవుని యందు నమ్మకముంచుటకు బదులుగా, చట్టమునకు విరుద్ధంగా చేయబడు అక్రమ నిధుల నిలువలకు వ్యతిరేకముగా యేసు హెచ్చరించాడు. ఐహిక సిరిసంపదలపై ముందుగానే మనస్సు నిమగ్నమగుట వలన అది విభజింపబడిన రాజభక్తిని మోసగించునని, దేవునియందలి విశ్వాసము కొరత పడుటకును దారితీయునని ఆయన ఉపదేశించిన ప్రధానాంశము ఉద్ఘాటించి చెప్పినది.

### దేవుని యెడల ఉండవలసిన భక్తి (6:19–24)

వేషధారణలో నున్న అపాయము గూర్చి హెచ్చరించిన తరువాత, దేవుని యెడల ఉండవలసిన యథార్థమైన భక్తి యొక్క ఔన్నత్యమైన స్థాయి గూర్చి యేసు ప్రస్తావించాడు. ఏకాగ్రతగల రాజభక్తి యొక్క ఇతివృత్తము సంపదకు సంబంధించిన సరైన దృష్టికోణంతో ముడిపడి యున్నది. సంబంధిత సంబంధమును తెలియజెప్పుటకు మూడు చిన్న వ్యాఖ్యానములు నివేదింపబడినవి. సమూలముగా భిన్నమైనవైయున్న రెండు విధములైన "ధనములు" (6:19–21), "కన్నులు" (6:22, 23), మరియు "యజమానులను" (6:24) ఇవి పరిగణలోనికి తీసుకొనుచున్నవి. బలమైన ఈ తారతమ్యములు ప్రయోగించుట ద్వారా, యథార్థమైన శిష్యత్వమును సవాలు చేయుచుండు జీవిత సమస్యలను వారు ప్రతిఘటించవలెనని యేసు తన ప్రేక్షకుల మనోస్థైర్యమును బలవంతంచేసాడు.

#### రెండు విధములైన ధనము (6:19–21)

**19భూమిమీద మీకొరకు ధనమును కూర్చుకొనవద్దు; ఇక్కడ చిమ్మెటయు, తుప్పును తినివేయును, దొంగలు కన్నమువేసి దొంగిలెదరు. 20పరలోకమందు మీకొరకు ధనమును కూర్చుకొనుడి; అచ్చట చిమ్మెటయైనను, తుప్పైనను దాని తినివేయదు, దొంగలు కన్నము వేసి దొంగిలరు. 21నీ ధనమెక్కడ నుండునో అక్కడనే నీ హృదయము ఉండును.**

**వచనము 19**. యేసు ఇచ్చిన మొదటి హెచ్చరిక, **మీ కొరకు ధనమును కూర్చుకొనవద్దు,** లోని మాటల మూల భాషలో శబ్ద చమత్కారమున్నది. *Thēsaurizō* అను గ్రీకు పదము నుండి ఉత్పన్నమైన మాట – "కూర్చుకొనుట," *thēsauros* అను నామవాచమునకు సంబంధించినదై, "ధనము" అని అనువదింపబడి యున్నది. ఈ పదము యొక్క ఆరంభ వాక్యము, "మీ కొరకు ధనమును నిధులుగా కూర్చుకొనవద్దు" అని అనువదింపబడవచ్చును.

**భూమి మీద** అను పదజాలము ఈ "నిధుల" తాత్కాలికమును భౌతికమునైన

స్వభావమును సూచించుచున్నది. ఒకడు తన జీవితములో చూపించుకొనుటకు వాని యొద్ద వాడు కూర్చుకొనిన భౌతిక విషయాలు తప్ప మరేమియు లేనట్లయితే, వాడు నిజముగా దరిద్రుడే. ఒకడు తన స్వార్థ ప్రయోజనాల కొరకు భౌతిక విషయములను చట్టమునకు వ్యతిరేకముగా అక్రమ నిలువ చేయుటకు ప్రాధాన్యమిచ్చుటలో, లేదా సంపద యొక్క అనిశ్చయత యందు నమ్మకముంచుటలో పాపము తిష్టవేసుకొని యున్నది (1 తిమోతి 6:17–19; మార్కు 10:17–24; లూకా 12:15; 18:24 చూడు).

ఒకడు ఐహిక ధనమును కూర్చుకొన కూడదు ఏలయనగా అవి **చిమ్మెటయు, తుప్పును** తినివేయును. యేసు కాలములో, ఒకని సంపద వాడు కలిగియున్న వస్త్రముల వంటి వస్తువులనుబట్టి విలువ కట్టబడినది. ఖరీదైన ఈ వస్త్రములను "చిమ్మెట" అతి సులభంగా తినివేయగలదు. "తుప్పు" అను మాట *brōsis* అను గ్రీకు పదము నుండి ఉత్పన్నమగుచు, "తినివేయునది" అను అక్షరార్థము కలిగియున్నది. "తుప్పు" ప్రశస్తమైన లోహమును సహితము తినివేస్తుంది (యాకోబు 5:2, 3).

ఈ ఐహిక ధనమును **దొంగలు కన్నము వేసి దొంగిలెదరని** కూడ యేసు చెప్పాడు. "కన్నము వేయుట" అని అనువదింపబడిన పదము *diorussō*కు "... గుండా త్రవ్వుట" అను అక్షరార్థము కలదు. దొంగలు మట్టి ఇటుకల చేత కట్టబడిన గోడల గుండా త్రవ్వుదురు (యోబు 24:16). సమస్త ఐహిక సొత్తులు తాత్కాలికమైనవి, ప్రస్తుతానికి మాత్రమే ఉపయోగపడునవి, మరియు గతించిపోవునవని యేసు నొక్కివక్కాణించుచుండెను. వారి ఆశలను వారికి చెందియుండి నశించిపోవునవి మరియు హరించుకుపోవునవైన వస్తుసముదాయము మీద నిర్మించుకొనుటలో గల మూర్ఖత్వము గూర్చి యేసు తన శిష్యులకు గుర్తు చేసాడు.

**వచనము 20.** ఈ హేతువులను బట్టి **పరలోకమందు ధనమును కూర్చుకొనుట**, అదొక అర్థసహితమైన అవగాహనయై యుండును. "పరలోకమందు ధనమును కూర్చుకొనుట" అనగా ఈ లోక సంబంధమైన ఐహిక వస్తు సముదాయముల కంటె ఎక్కువగా దేవునిని, ఆయన కమారుని, మరియు ఆధ్యాత్మిక అంశములను ప్రేమించుట యని అర్థము (లూకా 14:26–33; కొలొస్సయులకు 3:1, 2 చూడు). ఒకడు వాని భౌతిక ఆశీర్వాదములను దేవుని మహిమార్థమై మరియు ఆయన రాజ్యమును హెచ్చించుటకై ఉపయోగించుకొనుటకు వాడు ఎంపికచేసుకొన్నాడని అర్థము. ఇతరులకు సువార్తను ఉపదేశించుచు అవసరములో నున్నవారికి సహాయమును అందించవలెనని అతడు నిర్ణయించుకొన్నాడు. తన సొంత సొత్తుచేతనే స్వాయత్తం చేసికొనబడి యుండినవానికి, అనగా ధనవంతుడైన యౌవ్వన అధికారికి, "నీవు పరిపూర్ణుడువగుటకు కోరిన యెడల, పోయి నీ ఆస్తిని అమ్మి బీదలకిమ్ము, అప్పుడు పరలోకమందు నీకు ధనము కలుగును; నీవు వచ్చి నన్ను వెంబడించుమని" యేసు సెలవిచ్చాడు (19:21). "పరలోకమందు ధనమును కుర్చుకొనుట"ను పౌలు "సత్క్రియలు అను ధనముగలవారై యుండుటయు, ఔదార్యముగలవారై తమ ధనములో ఇతరులకు పాలిచ్చువారునై" యుండుట యని నిర్వచించాడు (1 తిమోతి 6:18, 19).

ధనమును కూర్చుకొనుట యను మనోభావము యొక్క వేళ్లు యూదా మతములో నున్నవి.[1] సిరాక్, అప్రామాణిక గ్రంథములలో నొకటి, ఇలా చెప్పుచున్నది,

> ఆజ్ఞ నిమిత్తమై బీదలకు సహాయము చేయుము, వారి అవసరములో వారిని వట్టిచేతులతో పంపివేయవద్దు. ఒక సహోదరుడు లేక ఒక స్నేహితుని కొరకు నీ వెండిని వెలికి తీయుము, దానిని ఒక బండ క్రింద దాచి తుప్పుపట్టనీయవద్దు, నాశనము కానీయవద్దు. మహోన్నతుని ఆజ్ఞల చొప్పున మీ ధనమును కూర్చుకొనుడి, అప్పుడు అది మీకు బంగారము కంటెను ఎక్కువ ప్రయోజనకరమైనదై యుండును.[2]

టాల్ముడ్ ఇలా సెలవిచ్చుచున్నది, "నా తండ్రులు అందుకొనుటకు చేయి చేరగల ఒక స్థలములో కూర్చుకొన్నారు, కానీ నేను అందుకొనుటకు నా చేయి చేరలేని ఒక స్థలములో కూర్చుకొన్నాను ... . నా తండ్రులు ఇహలోకము నిమిత్తము కూర్చుకొన్నారు, కానీ నేను భవిష్యత్ లోకము కొరకు కూర్చుకొన్నాను."[3]

**వచనము 21.** యేసు ఈ ప్రధానాంశమును గూర్చిన తన చర్చను మనము ధనమును కూర్చుకొనుటలో ఉండవలసిన నిత్య దృష్టికోణమును ఉద్ఘాటించి చెప్పకుండా ముగించలేదు. **నీ ధనమెక్కడ ఉండునో, అక్కడనే నీ హృదయముండును.** "హృదయము" (*kardia*) తరుచుగా ఒకని ఉనికి యొక్క కేంద్రమును సూచించుచున్నది. ఇచ్చట, దాని సాధారణ వాడుకను పాటించుచు, అది ఒకని "ప్రవృత్తులు," "ప్రాధాన్యతలు," మరియు "కోరికలను" సూచించుచున్నది. ఒకడు ఇహమందు "ధనమును" చట్టవిరుద్ధముగా తన నిమిత్తమే కూర్చుకొనినట్లయితే, వాని హృదయము కూడ అక్కడే ఉండును. వాడు దూరదృష్టిలేనివాడు, ఐహిక సుఖములపైనే మనస్సునుంచువాడు, వాడు ఆధ్యాత్మికతలేని వాడు. వాడు పరలోకమందు తండ్రితో కూడ నుండు నివాసము కొరకు ఆశించకూడదు. ఇందుకు తారతమ్యముగా, ఒకడు పరలోకమందు "ధనమును" కూర్చుకొన్నట్లయితే, వాని హృదయముండేది కూడ అక్కడే. వాడు క్రీస్తునకును ఆయన రాజ్యమునకును ప్రథమ స్థానమునిచ్చుచు, వాని ధనముతో ఇతరులకు ఉపచారము చేయును. వాడు ఇచ్చట సమృద్ధియైన జీవితమును, మరియు పరలోకమందు దేవునితో కూడ నిత్య జీవమును ఆనందంగా అనుభవించుటకు ఆశించవచ్చును.

### రెండు విధములైన కన్నులు (6:22, 23)

**22దేహమునకు దీపము కన్నే గనుక నీ కన్ను తేటగా ఉండినయెడల నీ దేహమంతయు వెలుగుమయమైయుండును. 23నీ కన్ను చెడినదైతే నీ దేహమంతయు చీకటిమయమై యుండును; నీలోనున్న వెలుగు చీకటియై యుండినయెడల ఆ చీకటి యెంతో గొప్పది!**

**వచనము 22.** దేవుని యెడల ఉండవలసిన నిరతి గూర్చి ఆయన ఉపదేశించుచుండిన తన ప్రధానాంశమును యేసు రెండవ ఉపమానములో కొనసాగించాడు. ఆయన రూఢిపరుస్తున్న విషయమిది: **దేహమునకు దీపము కన్నే.** మొదటి శతాబ్దమునాటి పాలస్తీనాలో, వెలుగునిచ్చుటకు నూనెతో మండుచుండిన దీపములు ప్రాథమిక వనరులుగా ప్రయోగింపబడినవి (5:15పై గల వ్యాఖ్యానమును చూడు). కన్ను మానవుని దేహమునకు ఒక దీపముగా పనిచేయుచు ప్రయోజనకరమైనదై యుంటున్నది; అది దేహమునకు మేలు చేయుచు దాని కదలికలను ప్రభావితముచేయు వెలుగును గ్రహించును.

ఈ పోలికను పోల్చిన తదుపరి, యేసు ఒక ముగింపు అభిప్రాయమును

తెలియజెప్పాడు: **గనుక నీ కన్ను తేటగా ఉండిన యెడల, నీ దేహమంతయు వెలుగుమయమై యుండును.** “తేటగా” అను అర్థమిచ్చు గ్రీకు పదము (*haplous*) “ఏక” (KJV) అని కూడ అనువదింపబడినది మరియు “ఏకదీక్షగల మనస్సుతో కూడిన దైవభక్తి” అను భావమునియ్యవచ్చును. జే. సి. రైల్‌తో పాటుగా, “ఆధ్యాత్మిక సౌభాగ్య సమృద్ధి కొరకు *దాని ఉద్దేశము గూర్చిన ఏకత్వము* ఒక గొప్ప రహస్యమై యున్నదని” మనము గుర్తించవలసి యున్నది.[4] ఏది ఏమైనా, ఈ పదము “ఆరోగ్యకరమైన” (NRSV) మరియు “మంచి” (NIV) అని కూడ అనువదింపబడినది, ఇది “ఉదారతా స్వభావమును” ధ్వనింపవచ్చును. ప్రాచీన కాలములో, ఒక “మంచి కన్ను” అను పదము ఉదారతా స్వభావమునకు ఒక నుడికారమై యుండినది. సామెతలు 22:9 అక్షరాలా ఇలా చెప్పుచున్నది: “దయాదృష్టిగలవాడు తన ఆహారములో కొంత దరిద్రునికిచ్చును, అట్టివాడు దీవెననొందును.” ఇంతేకాక. సంబంధిత పదము *haplotēs* ఔదార్యబుద్ధిగలవారై యుండుట గూర్చిన సందర్భములలో దర్శనమిచ్చుచున్నది (రోమీయులకు 12:8; 2 కొరింథీయులకు 8:2; 9:11, 13). “బహుశా *haplous* అను పదము, ఏకదీక్షత గల దైవభక్తి మరియు ఉదారతా స్వభావము గూర్చిన భావములను జోడించుచు ఈ వచనములో ద్వంద్వార్థము కలిగియుండవచ్చును.”[5]

**వచనము 23.** “వెలుగుమయమైయుండి” ధన్యుడైనవాడు, దైవభక్తిలేని వాడై **చీకటితో నిండియున్నవానితో** సంపూర్ణమైన తారతమ్యములో పోల్చబడుచున్నాడు. వీని **కన్ను చెడ్డదై యున్నదని** యేసు సెలవిచ్చాడు. “చెడ్డ” అను అర్థమిచ్చు గ్రీకు పదము (*ponēros*) “దుష్టమైన” అని కూడ అనువదించవచ్చు (KJV). “చెడిన కన్ను” అను అభివ్యక్తము. “పిసినారి,” “పేరాశ,” లేక “అసూయ” గల వానికి సంబంధించి వాడబడినది (ద్వితీయోపదేశకాండము 15:9; సామెతలు 23:6; KJV). సామెతలు 28:22 ఇలా చెప్పుచున్నది, “చెడు దృష్టిగలవాడు ఆస్తి సంపాదింప ఆతురపడును, తనకు దరిద్రత వచ్చునని వానికి తెలియదు.” యేసు ఉపదేశించిన ఉపమానములలోని ఒక దానిలో, ఇంటి యజమానుడు ఈ ప్రశ్న వేసాడు: నేను మంచివాడనైనందున నీ కన్ను చెడినదై [*ponēros*] యున్నదా?” (20:15). ఒకడు పేరాశ చేత జయింపబడినట్లయితే, వాని జీవితము నిజముగానే దౌర్భాగ్యమైనదై యుండును.[6] **నీలోనున్న వెలుగు చీకటియై యుండిన యెడల ఆ చీకటి యెంతో గొప్పదని** యేసు ఆశ్చర్యముతో పలికాడు!

### రెండు విధములైన యజమానులు (6:24)

**[24]ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా నుండనేరడు; అతడు ఒకని ద్వేషించి యొకని ప్రేమించును, లేదా యొకని పక్షముగా నుండి యొకని తృణీకరించును.**

**వచనము 24.** “యజమాని” అను అర్థమిచ్చు గ్రీకు పదము (*kurios*), తరచుగా “ప్రభువు” అని అనువదింపబడుచు, నాయకత్వమును, కర్తృత్వమును, ఉన్నత పదవిని, మరియు అధికారమును ప్రతిబింబించుచున్నది. ఈ సందర్భములో, ఇది అత్యంత నిర్దిష్టముగా బానిసలుగల యజమానిని సూచించుచున్నది. మొదటి శతాబ్దములో, యజమానియైనవాడు ఒక బానిస జీవితములోని ప్రతి కోణము గూర్చి సంపూర్తి ఆధీనముగలవాడై యుండెను. బానిసయైనవాడు ఇతరులవలెవరికిని ఏమియు చేయలేనివాడై యుండెను, ఏలయనగా

వాడు బొత్తిగా వాని యజమానికే చెందియుండెను.

**ఇద్దరు యజమానులు** ఒక బానిసను ఉమ్మడిగా కలిగియుండిన విషయము ఎవరికిని తెలియనిది కాదు (ఆదికాండము 37:28; అపొస్తలుల కార్యములు 16:16, 19).[7] ఏదిఏమైనా. ఒక బానిస పరస్పరము విరుద్ధమైన అభిరుచులుగల ఇద్దరు యజమానుల యెడల సంపూర్ణ **రాజభక్తిగలవాడై** యుండుట అసాధ్యమై యుండి యుండును. వాడు ఒకని కంటె రెండవ వానిని ఎక్కువ ఇష్టపడును. ఈ సందర్భములో, **ద్వేషించును** అను మాట "తక్కువగా ప్రేమించునని" అర్థమిచ్చునని జాక్. పి. లూయిస్ చెప్పుచున్నాడు (ఆదికాండము 29:31–33; ద్వితీయోపదేశకాండము 21:15 చూడు).[8]

యేసు సూత్రప్రాయంగా ఇలా చెప్పుచున్నాడు, **మీరు దేవునికిని సిరికిని దాసులుగా నుండనేరరు.** "ధనము"నకు బదులుగా, KJVలో "సిరి" అను మాట ప్రయోగింపబడియున్నది. *Mamōnas* అను గ్రీకు పదమునకు ఇదొక లిప్యంతరీకరణమై యున్నది, ఇది అరమెక్ భాషలోని *mamon* అను మాట నుండి తీసికొనబడినది. ఇదే పదము క్రొత్త నిబంధనలో మరొక చోట, లూకా 16:9, 11, 13లో మాత్రమే కనిపించును. "సిరి" లేక "ధనము" అను పదములు ఇచ్చట ఒక యజమాని వలె సంకేతములుగా చిత్రీకరింపబడినవి. లూయిస్ ఇలా గుర్తించుచున్నాడు, "మానవులనేకులు 'ఇది సొంతం' అని వారనుకొనుచున్నా దాని చేతనే వారు సొంతం చేసుకొనబడి యున్నారు."[9]

## చింతను జయించుట (6:25–34)

**25అందువలన నేను మీతో చెప్పునదేమనగా–ఏమి తిందుమో యేమి త్రాగుదుమో అని మీ
ప్రాణమును గూర్చియైనను, ఏమి ధరించుకొందుమో అని మీ దేహమును గూర్చియైనను
చింతింపకుడి; ఆహారముకంటె ప్రాణమును, వస్త్రముకంటె దేహమును గొప్పవి కావా?
26ఆకాశపక్షులను చూచుడి; అవి విత్తవు కోయవు కొట్లలో కూర్చుకొనవు; అయినను మీ
పరలోకపు తండ్రి వాటిని పోషించుచున్నాడు; మీరు వాటికంటె బహు శ్రేష్ఠులు కారా?
27మీలో నెవడు చింతించుటవలన తన యెత్తు మూరెడెక్కువ చేసికొనగలడు? 28వస్త్రములను
గూర్చి మీరు చింతింపనేల? అడవిపువ్వులు ఏలాగు నెదుగుచున్నవో ఆలోచించుడి. అవి
కష్టపడవు, ఒడకవు 29అయినను తన సమస్త వైభవముతో కూడిన సొలొమోను సహితము
వీటిలో నొకదానివలెనైనను అలంకరింపబడలేదు. 30నేడుండి రేపు పొయిలో వేయబడు అడవి
గడ్డిని దేవుడీలాగు అలంకరించినయెడల, అల్పవిశ్వాసులారా, మీకు మరి నిశ్చయముగా
వస్త్రములు ధరింపజేయును గదా. 31కాబట్టి–ఏమి తిందుమో యేమి త్రాగుదుమో యేమి
ధరించుకొందుమో అని చింతింపకుడి; అన్యజనులు వీటన్నిటి విషయమై విచారింతురు.
32ఇవన్నియు మీకు కావలెనని మీ పరలోకపు తండ్రికి తెలియును. 33కాబట్టి మీరు
ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును.
34రేపటినిగూర్చి చింతింపకుడి; రేపటి దినము దాని సంగతులనుగూర్చి చింతించును;
ఏనాటికీడు ఆనాటికి చాలును.**

దేవుని యెడల పూర్ణహృదయముతో భక్తిగలవాడు ధనమునకు దాసుడు కానేరడు, భూమి మీద ధనమును కూర్చుకొనడు. దానికి బదులుగా, వాడు ఉదారతతో, ఇతరులు

యేసుక్రీస్తును ఎరుగునట్లు వారికి సహాయము చేయుచు, అవసరములో నున్నవారిని ఆదుకొనువాడై యుండును (6:19–24). ఇతడు తన జీవితములో దేవుని రాజ్యమునకు ప్రథమ స్థానమునిచ్చుచున్నాడు గనుక దేవుడు అతని గూర్చి తగు శ్రద్ధ వహించునని విశ్వసించును (6:25–34).

చింతించకూడదనుటకు ఇచ్చిన మందలింపుతో యేసు మొదలుపెట్టి (6:25), అటుతరువాత సంబంధిత ఈ సూత్రమును "ఆకాశ పక్షులు" (6:26, 27) మరియు "అడవి పువ్వులను" (6:28–30) ప్రస్తావించుచు ప్రకృతిలో నుండే ఉదాహరణంగా చిత్రీకరించాడు. వారు చింతించుటకు ఆపుజేసి, రాజ్యమును వెంబడించుటకు ఆరంభించవలెనని ఆయన తన శిష్యులకు పిలుపునిచ్చుచు, మందలింపును పునరుక్తము చేసాడు (6:31–34).

**వచనము 25. అందువలన,** అని పలుకుచు ఆయన అదివరకే తెలియజెప్పిన దానిని యేసు ప్రస్తావించుచుండెను. ఒకడు దేవునిని తన యజమానిగా సేవించుచున్నట్లయితే, అప్పుడు వాడు **చింతించుటకు** ఏ హేతువైనను ఉండదు; ఏలయనగా దేవుడు వాని సమస్త అవసరములను సమకూర్చును. "చింతకు" సంబంధించిన గ్రీకు మాటకు (*merimnaō*) "ఆత్రుత కలిగియుండుట" లేక "అనవసరంగా ఆందోళన చెందుట" అని అర్థము. ఒకడు తన యజమానుని సేవించుటలో ఖర్చుచేయవలసిన బలమును చింత ఖాళీచేయును. "దేనిని గూర్చియు చింతింపకుడి గాని ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనములచేత కృతజ్ఞతాపూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడని" పౌలు రచించాడు (ఫిలిప్పీయులకు 4:6; 1 పేతురు 5:7 చూడు).

**ప్రాణము** అను సమానార్థమిచ్చు గ్రీకు పదము (*psuchē*) క్రొత్త నిబంధనలో నానా విధములుగా వాడబడినది. అది మన ఉనికిలోని మానసిక, భావోద్రేక, శారీరక, మరియు ఆధ్యాత్మిక కోణములను చుట్టుముట్టును. ఈ వచనములో, "ప్రాణము" స్పష్టముగా "శరీరమును సజీవంచేయు సూత్రమును" సూచించును.[10] శరీరముతో (*sōma*) ఒక సమానాంతరమును రూపొందించుచున్నది. మానవులు భౌతికముగా బ్రతికి ఉండుటకు **ఆహారము, నీళ్లు**, మరియు **వస్త్రములు** కలిగియుండవలెను. మైఖేల్ జే. విల్కిన్స్ ఇలా సూచించుచున్నాడు, "జీవితములో ఎదురయ్యే అనుదిన పోరాటముల గూర్చి ఎరుక ఉండిన ప్రజలతో మాటలాడుచున్నాడు. వారి అనుదిన నిత్యకృత్యములలోని అధిక శాతం ఏనాటి జీవితం ఆనాడు గడుచునట్లు సరిపడునన్ని సమకూర్పులు సమకూర్చుకొనుటకు ప్రయత్నించుటలోనే గడిచిపోవుచున్నది."[11] ఏది ఏమైనా. జీవితమునకు కేవలము భౌతికముగా కాపాడబడుచు సంరక్షించబడుట కంటె అత్యధికమైన అర్థము మరియు ఉత్తమమైన లక్ష్యములున్నవి.

**వచనము 26.** ఆయన చెప్పిన మొదటి చిత్రీకరణములో యేసు, దేవుడు **ఆకాశ పక్షులకు** ఆహారమును సమకూర్చుచున్నాడను అభయమునిచ్చాడు. మానవుల వలె గాక, అవి **విత్తవు, కోయవు, కొట్లలో కూర్చుకొనవు.** ఈ వాంగ్మూలము నుండి, ఒకడు ఆకాశ పక్షులు వాటి ఆహారము నిమిత్తము ఏ పనీ చేయవను తుది అభిప్రాయమునకు రాకూడదు. అవి ఉదయాన్నే, వాటి ఉదయకాల అల్పాహారము కొరకు వానపాములను పోగుచేయుచుండుట మనము చూడవచ్చును. అట్లయినప్పటికిని, అవి పునరుత్పత్తి యగునట్లు ఈ ప్రాణులు ఏమీ చేయవు; దేవుడే వాటిని సమకూర్చుచున్నాడు. దేవుడు

అదివరకే సమకూర్చిన వాటిని పొందుటకు అవి కేవలము వాటి ప్రయాసమును మాత్రమే వెచ్చిస్తాయి. యేసు, ఈ ఉదాహరణ చిత్రీకరణములో, 'అల్పమైన దానిలో నుండి గొప్పదైన' పాఠము నేర్చుకొనుట యను వాదనను ప్రయోగించుచుండెను. దేవుడు అల్పమైన ఆకాశ పక్షుల గూర్చి చింతించుచు శ్రద్ధవహించునట్లయితే, నిశ్చయముగా ఆయన తన పోలిక చొప్పున సృజింపబడిన మానవులకు ఆహారమును సమకూర్చును (ఆదికాండము 1:27). నిజముగా, మానవులు ఆకాశపక్షుల కంటె **ఎంతో ఎక్కువ విలువైనవారై** యున్నారు (కీర్తనలు 8:3–8 చూడుము).

**వచనము 27**. చింతించుట నిరర్థకమను విషయమును నిదర్శనముగా ప్రదర్శించుటకు యేసు, **మీలో నెవడు చింతించుట వలన తన ప్రాణమునకు ఒక గంట ఎక్కువ చేసికొనగలడు**? అని ప్రశ్నించాడు. అలంకారయుక్తమైన ఈ ప్రశ్నకు సమాధానము, "ఎవడూ లేడు."

"తన ప్రాణమునకు ఒక గంట ఎక్కువ చేసికొనగలడు?" అని అనుటకు బదులుగా, KJVలో "తన యెత్తు మూరెడెక్కువ చేసికొనగలడు" అని వ్రాయబడి యున్నది. "మూరెడు" అను మాటకు గ్రీకు భాషలో నున్న (*pēchus*) మూల భాషలో "ముంజేయి" అను అర్థమునిచ్చినది, అటుతరువాత అది కొలతలోని ఒక ప్రమాణకాంశమని (సుమారు పదునెనిమిది అంగుళములు/నలభైఐదు సెంటీమీటర్లు అని) ప్రస్తావింపబడినది. ఏది ఏమైనా, సమయములోని కొంత పరిమాణమును సూచించుటకు కొన్ని పర్యాయములు ప్రత్యేక కొలమానములు ఉపయోగింపబడినవి (కీర్తనలు 39:5). "యెత్తు" అను పదము (*hēlikia*) ఒకని "వయస్సును" సహితము సూచింపవచ్చును (యోహాను 9:21; హెబ్రీయులకు 11:11). యేసు "అన్నిటికంటె తక్కువైనది" అని ప్రస్తావించుచుండెను (లూకా 12:25, 26), గనుక అత్యధికమైన ఆధునిక అనువాదములు ఈ పదములను ఒకని ఆయుష్యుకు అల్ప కాలమును చేర్చుట యని అర్థమిచ్చునట్లుగా అనువదించుచున్నవి. ప్రత్యామ్నాయము – ఒకని యెత్తు మూరెడెక్కువ చేసికొనుట – ఒక వింతైన సాహస కృత్యమై యుండుననునది ఈ అనువాదమునకు ప్రాథమికమైన హేతువై యున్నది! కాబట్టి, NASBలోని పదజాల ప్రయోగము సరైనదేనని కనిపించుచున్నది.

**వచనములు 28, 29.** ఆయన చెప్పిన రెండవ చిత్రీకరణములో, యేసు తన దృష్టిని **వస్త్రముల** మీద కేంద్రీకరించాడు. మరొక పర్యాయము, ఆయన ప్రకృతి వైపు చూసాడు, **అడవి పువ్వులను** సాదృశ్యముగా తీసుకొన్నాడు. ఒక పువ్వు దాని అందమును అది అర్హురాలగుటకు అది ఏమి చేస్తోంది? అవి **కష్టపడవు** లేక **ఒడకవు,** అట్లయినను అలంకారముగా ఉండుటకై ఉపయోగింపబడు అల్లికలలోని రంగులు ఒక్క చోటికి వచ్చినవి అల్లబడిన వస్త్రములపై అందమైన అలంకారములను సృష్టిస్తాయి. పుష్పముల వైవిధ్యములు, రంగులు, ఆకారములు, మరియు పరిమళ వాసనలు ఎంతో దిగ్భ్రాంతిని కలిగించునవిగా ఉంటాయి.

అడవి పువ్వులకు సంబంధించినంత వరకు, **సొలొమోను సహితము – ఆయన ధరించిన కళాత్మకమైన వస్త్రములతో సహా – వీటిలో నొకదానివలెనైనను అలంకరింపబడలేదని** యేసు సెలవిచ్చాడు. రాజైన సొలొమోను ఆయనకుండిన గొప్ప జ్ఞానమునుబట్టి మాత్రమే కాదు, గాని ఆయన కలిగియుండిన గొప్ప సిరిసంపదలనుబట్టి కూడ లోక ప్రసిద్ధమైనవాడై యుండెను

(1 రాజులు 312, 13; 10:1-29; 2 దినవృత్తాంతములు 9:1-28); అట్లయినప్పటికిని ఆయన ధరించిన అత్యంత సన్నమైనవియు చక్కనైనవై యుండిన రాజవస్త్రములు దేవుడు తన అందమును వాటికి ధరింపజేసిన పువ్వులతో పోల్చబడిన పోలికతో పాలిపోయాయి. యేసు మనస్సులో ఏదో ఒక నిర్దిష్టమైన పువ్వు ఉండియుండదు. ఏది ఏమైనా, ఊదారంగు గల ఒక రకమైన అడవి పువ్వు సూచింపబడినది, బహుశా సొలొమోను రాజవస్త్రముల రమ్యతను చూపించవలెనని పోల్చుటకై యుండవచ్చును (న్యాయాధిపతులు 8:26 చూడు). విల్కిన్ గుర్తించిన విషయం ఇలా వున్నది, "నేడు సహితము, ఎరుపు మరియు ఊదారంగు గల అడవి పుష్పములు (anemone coronaria) పదంగుళముల పొడవున్న కాండముతో, blue iris అను పువ్వులతో పాటు, గలిలయ సముద్రమునకు మీదుగా నున్న పర్వతశ్రేణుల ప్రాంతములో ఎదుగుచుండును."[12]

**వచనము 30.** దేవుడు అందమైన పువ్వులను **పొలములోని పచ్చికబయలుపై** వస్త్రములనుగా సమకూర్చుతాడు. ఏది ఏమైనా, ఈ పచ్చికబయళ్లు కేవలము తాత్కాలికముగా నిలుచునవే: "సూర్యుడుదయించి, వడగాలి కొట్టి, గడ్డిని మాడ్చివేయగా దాని పువ్వు రాలును, దాని స్వరూప సౌందర్యమును నశించును" (యాకోబు 1:11; 1 పేతురు 1:24 చూడు). ఈ అడవి గడ్డి **నేడు సజీవముగా, అందముగా ఉంటుంది కానీ రేపటి దినాన పొయ్యిలో వేయబడుతోంది**. బీదవారు వాడిపోయిన ఈ పువ్వులను పోగుచేసి తీసికొని వెళ్లి పొయ్యిలో వేయుటకు అనువైనదిగా ఉపయోగించుకొందురు. మరొకసారి, యేసు తర్జనభర్జన చేయుచుండిన విషయము 'అల్పమైన వాటి నుండి గొప్ప పాఠమై' యుండినది. దేవుడు అప్రధానమైన అడవి గడ్డిని యిలా అలంకరించినట్లయితే, నిశ్చయముగా ఆయన తన ప్రజలకు వస్త్రములను ధరింపజేయును.

"అల్పవిశ్వాసులారా" అను అభివ్యక్తము మత్తయి వ్రాసిన సువార్తలో అనేక పర్యాయములు కనిపించుచున్నది (8:26; 14:31; 16:8; 17:20). టాల్ముడ్ ఇలా సెలవిచ్చుచున్నది, "తన గంపలో ఒక రొట్టె ముక్కను కలిగియుండి, 'రేపటి దినాన నేనేమి తినవలెను?" అని పలుకు ప్రతివాడు, అల్ప విశ్వాసుల గుంపునకే చెందినవాడై యున్నాడు."[13]

**వచనములు 31, 32.** ఇదే సందర్భములో, యేసు ఏమి **తిందుమో**, ఏమి **త్రాగుదుమో,** ఏమి **ధరించుకొందుమో** అని **చింతించుట** గూర్చి చెప్పిన తన మూల మందలింపును పునరుక్తము గావించాడు (6:25 చూడు). మనకు కొన్ని అవసరములున్నవని దేవుడెరుగును, గనుక మన వంతుకు మనము చేయవలసిన పనులను మనము చేసినప్పుడు, ఆయన వాటిని మనకు సమకూర్చును. చింత, మనము తినుటకు ఆహారమును, త్రాగుటకు నీళ్లను, ధరించుటకు వస్త్రములను లేక తలదాచుకొనుటకు ఇల్లును సమకూర్చదు, సరికదా అది ఎవరి ఆయుష్కాలమునకును ఒక నిమిషమును అదనంగా కలుపజాలదు. మనము తినుటకు ఆహారము, ధరించుటకు వస్త్రములను లేక తలదాచుకొనుటకు ఇల్లును కలిగియునట్టయితే, మనకు నిజముగా ఇంత కంటే యింకా ఎక్కువ ఏమి అవసరమున్నది? చింతించుట వలన ఎటువంటి ప్రయోజనమైనను లేదు. పౌలు ఇలా వ్రాయుచున్నాడు, "సంతుష్టి సహితమైన దైవభక్తి గొప్పలాభసాధనమై యున్నది. మనమీలోకములోనికి ఏమీయు తేలేదు, దీనిలో నుండి ఏమియు తీసుకొనిపోలేము. కాగా అన్నవస్త్రములగలవారమై యుండి వాటితో తృప్తిపొందియుందుము" (1 తిమోతి 6:6-8).

**అన్యజనులు వీటన్నిటి విషయమై అత్యంత ఆతురతతో విచారింతురని** యేసు సెలవిచ్చాడు. అనగా, ఆహారము, నీళ్లు, మరియు వస్త్రములను సంపాదించుకొనవలెనని వాటి వెంటబడుచు వాటి కొరకై ప్రయాసపడుట ఒకనిని దేవుని ఎరుగని మతేతరునిగా చేయునని మరొక మాటలో చెప్పుకొనవచ్చును (ఎఫెసీయులకు 2:11, 12). రాబర్ట్ హెచ్. మౌన్స్ ఇలా చెప్పుచున్నాడు, "చింత, ఆచరణాత్మకంగా దేవుడు లేడని చెప్పుచు ఆయనను బుద్ధిపూర్వకముగా తిరస్కరించుచు అవమానపరచుటయే ఔతుంది."[14] అన్యజనులతో పోల్చబడుట నిస్సందేహముగా ఆయన శ్రోతలను అబ్బురపరచి వారికి దిగ్భ్రాంతి కలిగించుచు, వారు ఆయన మాటలను ఆచితూచి వాటి గూర్చి జాగ్రత్తగా ఆలోచించవలసి యుండునట్లు వారిని బలవంతము చేసియుండును. "అన్యజనులు" అని యేసు చేసిన కొండమీద ప్రసంగములో ఆయన ప్రస్తావించుట ఇది మూడవసారి (5:47; 6:7పై గల వ్యాఖ్యానము చూడు).

**వచనము 33.** జీవితమునకు అవసరమైన భౌతిక అవసరములను వెదకుటకు బదులుగా, వారు **ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకవలెనని** యేసు తన శిష్యులకు ఆదేశించాడు. "రాజ్యము" (*basileia*) మరియు "నీతి" (*dikaiosunē*) అను పదములు యేసు కొండమీద చేసిన ప్రసంగములో తరుచుగా దర్శనమిచ్చుచుండును (5:3, 6, 10, 19, 20; 6:1, 10, 13, 33; 7:21).

"ఆయన రాజ్యము" దేవుని ఏలుబడిని లేక అధిపత్యమును సూచించుచున్నది, ఇది క్రీస్తు యొక్క సంఘ స్థాపనగా రూపు దాల్చినది (6:10పై గల వ్యాఖ్యానము చూడు). అటుతరువాత, మత్తయి వ్రాసిన సువార్తలో, "రాజ్యము" (*basileia*) మరియు "సంఘము" (*ekklēsia*) అను పదములు దాదాపుగా పరస్పరము మార్పిడి చేయబడుచు ఉపయోగింపబడినవి (16:18, 19). "ఆయన నీతి" దేవుని జీవి ప్రామాణికమును సూచించుచున్నది, గనుక ఆయన ఆజ్ఞలను హృదయపూర్వకముగా గైకొనుట ఇందుకు ఆవశ్యమై యున్నది (5:6, 20పై గల వ్యాఖ్యానమును చూడు). గతించిన కాలములో, దేవుని నీతియుక్తమైన శాసనములు మోషేకివ్వబడిన ధర్మశాస్త్రము ద్వారా బయలుపరచబడినవి. ఏది ఏమైనా, క్రీస్తు ఒక నూతన నిబంధనను వ్యవస్థాపించుటకు వచ్చాడు. ఈ నిబంధనలో పాల్గొనుచున్నవారై యుండువారు, వారు విధేయులగుటకు అనుకూలముగా నుండునట్లు ఎంపిక చేసికొనిన వాటిని మాత్రమే అభ్యసించకుండా, క్రీస్తు ఉపదేశములన్నిటిని అంగీకరించుచు వాటిని అభ్యసించుటకు సమ్మతించవలెను.

ప్రజలందరును ఆయనను "వెదకవలెనని" దేవుడు ఆశించుచున్నాడు (అపొస్తలుల కార్యములు 17:26, 27; హెబ్రీయులకు 11:6 చూడు). "వెదకుడి" అని అనువదింపబడిన గ్రీకు పదము (*zēteō*) క్రొత్త నిబంధనలో లెక్కలేనన్నిసార్లు అగుపించును. ఇచ్చట, అది ఒక్క సారి వెదకుటతో ముగియు విషయముగా గాక, ఎడతెరిపిలేకుండా వెదకుటను సూచించు వర్తమాన విధివాచకమై యున్నది. "దేవుని రాజ్యమును మరియు ఆయన నీతిని" వెదకుట ఒకని జీవితము యొక్క ప్రథమ ప్రాధాన్యతయై యుండవలెను. ఫలితం పౌలు మాటల్లో, అది "నీతియు సమాధనమును పరిశుద్ధాత్మ యందలి ఆనందమునై" యుండును (రోమీయులకు 14:17). దేవుని రాజ్యమును మరియు నీతిని మొదట వెదకుటకు ప్రథమ స్థానమునిచ్చుట వలన ఐహిక విచారముల గూర్చిన మూర్ఖపు చింత తొలగింపబడును. దేవుని పిల్లలు

దీనిని చేసినట్లయితే, **ఇవన్నియును** (జీవితావసరములన్నియును) మనకు అందుబాటులో నుండునని మన ప్రభువు వాగ్దానము చేసాడు (ఫిలిప్పీయులకు 4:11-13 చూడు).

**వచనము 34. గనుక రేపటిని గూర్చి చింతింపకుడి; రేపటి దినము దాని సంగతులను గూర్చి చింతించును. ఏనాటి కీడు ఆనాటికి చాలునని** పలుకుచు యేసు తన ఉపదేశమును ముగించాడు. శిష్యుడనబడువాడు రేపటి గూర్చి అపరిమితముగా ఆందోళన చెందకూడదు, కానీ ఒక్కొక్క రోజు చొప్పున జీవించవలెను. భవిష్యత్తులో ఎదురౌనేమో అను సమస్యల చేత ముంచెత్తబడిపోవుట కంటే, దానికి బదులుగా ప్రస్తుత అసలు సమస్యలను ఎదుర్కొనవలెను.

భవిష్యత్తు గూర్చి చింతించుట వాస్తవమునకు ఒకడు ప్రస్తుతమును విజయవంతముగా తట్టుకొనకుండునట్లు అది వాని శక్తిసామర్థ్యములను దౌర్బల్యము చేయును, మరియు వాని ఆయుష్కాలమును తగ్గించవచ్చును. అప్రామాణిక గ్రంథంలో, సిరాక్ పుస్తకము ఇలా చెప్పుచున్నది, "చింత, అకాల వృద్ధాప్యమును కలుగజేయును."[15] ఇంతేగాక, ప్రజలు చింతించుచుండు అనేక విషయములు ఎన్నడును సంభవింపవు; జీవితములోని పరిస్థితులు స్థిరముగా నుండక ఎప్పటికప్పుడు మారుచునే యున్నవి (సామెతలు 27:1; యాకోబు 4:13-17). టాల్ముడ్ ఇలా సెలవిచ్చుచున్నది, "రేపటి కష్టమును గూర్చి ఈనాడు వ్యథనొందకుము, ఏలయనగా రేపటి దినమున ఏమి సంభవించునో నీకు తెలియదు, మరియు బహుశా రేపు వాడుండకపోవచ్చును, ఈ విధంగా వాడు వానిది కాని లోకము గూర్చి దుఃఖపడుచున్నట్లు కనుగొనబడును."[16] ఇంకా, "ఒక్క గంట లోపలనే చాలినంత కష్టమున్నదని" కూడ ప్రకటించుచున్నది.[17]

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

### ధనమును కూర్చుకొనుట (6:19-24)

అమెరికా దేశస్థులు ఈనాడు త్వరగా విక్రయము చేయబడగల ఆదాయమును, అతి త్వరలోనే రేపటి దినాన ఎందుకూ పనికిరాని చెత్తగా మారుచున్న సిరిసంపదలపై వ్యయము చేయుచున్నారు. మనకుంటే బాగుండునని మనము అనుకొను వస్తువు వచ్చే సంవత్సరంలోని బహిరంగ అమ్మకంలో ఎవరో ఒక వేటగానికి అదొక చవక బేరమైపోతోంది. ఒక వివేకవంతుడు ఇలా వ్రాశాడు, "అమెరికా దేశస్థులు వారి యొద్ద లేని డబ్బును, వారికి అవసరములేని వస్తువులను కొనుగోలు చేయుటకు, వారికిష్టములేని మనుష్యుల మనస్సులపై ఒక చెరగని ముద్రవేయవలనను ఉద్దేశముతో వ్యయము చేయుచున్నారు."

వారు అదివరకే కలిగియున్న దానిని ఆనందంగా అనుభవించలేనంతగా అనేకులు ఐహిక సంపద కొరకైన అన్వేషణ చేత అధిగమించబడుచున్నారు. ఐహిక సొత్తుల గూర్చిన ఆలోచన నిమగ్నత, "అత్యధిక ఆటబొమ్మలు కలిగి చచ్చిపోవువాడు విజేత యగునని" ప్రకటింపబడు వ్యాపార ప్రకటనల చేత యుక్తిగల శక్తితో హస్తగతం చేసుకొనబడుచున్నది. ఏది ఏమైనా, "మనము చచ్చిపోయినప్పుడు మనతో కూడ ఏమియు కొంచుబోలేమని" మనకందరికిని తెలిసిన ఒక నగ్న సత్యమై యున్నది. "మనమీలోకములోనికి ఏమియు తేలేదు, గనుక ఈ లోకములో నుండి ఏమియు తీసికొనిపోలేమని" పౌలు వ్రాయుచున్నాడు (1 తిమోతి 6:7, 8). ఐగుప్తు దేశమునేలిన కొందరు ఫరోలు, వారి మరణాంతరం జీవితములో వారు

ఆనందంగా అనుభవించునట్లు వారి ధనముతో పాటు గొప్ప పిరమిడ్‌లలో పాతిపెట్టబడిరి. కానీ దానికి బదులుగా, వారి ధనమంతయు తరువాతి తరములలో లూటీచేయువారు, భూగర్భశాస్త్రవేత్తలు, మరియు పూరావస్తు ప్రదర్శనశాల సొత్తైపోతుంది.

మన దృష్టినంతా ఐహిక సొత్తులను కూడబెట్టుట మీదనే కాదు, కానీ దేవుని రాజ్య నిర్మాణముపైనను ఇతరులకు సహాయము చేయుట పైనను కేంద్రీకరించి యుంచవలెను. మనము దేవుని నుండి పొందు దీవెనలను ఇట్టి సదుద్దేశములు కొరకు సద్వినియోగము చేసికొనుట ద్వారా, మనము పరలోకముందు ధనమును కూర్చుకొనగలము. మన ధనము భూమి మీద ఉన్నట్లయితే, పరలోక పయనం కొరకు మనలను మనము సిద్ధపర్చుకొనము: “నీ ధనమెక్కడ ఉండునో, అక్కడనే నీ హృదయముండను” (6:21). అప్పుడు మనము పరలోకమందుండు నిత్య సంతోషమును కోల్పోవుదుము. మన ఖాతలో, “చాలినన్ని నిధులు లేవని” లేక “ఖాతా మూసివేయబడినదని” తీర్పు దినాన తెలిసికొనుట అదెంత దుఃఖకరముగా నుండును కదా!

క్రైస్తవులముగా, మన విశ్వాస భక్తి క్రీస్తు యెడల ఉన్నది. మనము ఆయనను మరియు ధనమును ఒకే సమయంలో సేవించజాలము. ఒకడు ఒకసారి తన ఐహిక సొత్తులకు బానిస అయ్యాడంటే, వాడు క్రీస్తును తన జీవితములో నుండి వెలుపలికి నెట్టివేసాడని చెప్పుకొనవచ్చును. పూర్తిగా ఐహిక విషయాలతో నిండియున్న హృదయంలో క్రీస్తు నివసింపలేడు. ఏదో ఒకటి ఎంపిక చేసుకొనబడవలెను. మనము దేవునితో కూడ నిత్యము ఉండవలెనని ఆశించుచున్నట్లయితే, పాపము మరియు మన సొత్తులకు బదులుగా, మనము ఆయనను మరియు ఆయన నీతిని సేవించుటకు ఎన్నుకొనవలెను (రోమీయులకు 6:16-18 చూడు).

## సర్వశక్తిమంతుడైన దేవుడు (6:24)

(అమెరికా) సంయుక్త రాష్ట్రములను వ్యవస్థాపించిన పితామహులు విశ్వాస సహితమైనవారై యుండి, ఒక దేశముగా మనము సాధించుచున్న సఫలీకృతము మనము దేవుని నుండి పొందిన ఒక దీవెనయై యున్నదని నమ్మారు. మన దేశ నాణెముల మీదను, కరెన్సీ నోటుల మీదను “In God We Trust” (“మేము దేవుని యందు విశ్వసించుచున్నాము”) అని ముద్రించు సాంప్రదాయమును వారు మొదలుపెట్టారు, ఏలయనగా వారి సకల స్వతంత్రములకు ఆయన సమకూర్పులే హేతువై యున్నవనియు, భవిష్యత్తులో వారి కృత్యకృత్యములకు విజయమును చేకూర్చునవి అవే అనియు వారు విశ్వసించారు. మనము “సర్వశక్తిమంతమైన డాలర్” కంటే, దానికి బదులుగా సర్వశక్తిమంతుడైన దేవుని యందు నమ్మకముంచవలెనని వారు ఆశించారు. డాలర్ నోట్‌ను తిరగవేసినప్పుడు, ఎడారిలో నుండి పైకి లేచుచున్న పిరమిడ్‌కు (మన జయప్రదమునకు సాంకేతికముగా నున్న దానికి) సమస్తమును చూచుచున్న కన్ను (దేవుని సమకూర్పులకు సాంకేతికముగా నున్నది) మకుటముగా నున్నది. దాని పైభాగములో నున్న లాటిన్ భాషలోని పదజాలము, *Annuit Coeptus*, “మనము చేపట్టు పనులను ఆయన మనకనుగ్రహించును” లేక “దేవుడు మన యెడల చిరునవ్వు నవ్వుచున్నాడు” అని అనువదింపబడవచ్చును.

డేవిడ్ స్టూవర్ట్

## చింత (6:25-34)

"చింత" అను సమానార్థమిచ్చు ఆంగ్ల పదము, "గొంతు నులుము" అని అర్థమిచ్చు ఒక ప్రాచీన జర్మన్ దేశ పదము నుండి ఉత్పన్నమగుచున్నది. వాస్తవానికి చింత చేసే పని కూడ అదే: అది మన జీవిత ఆహ్లాదములను ఆనందంగా అనుభవింపనీయక, మనలను మరి ఎక్కువగా చిక్కుల్లోనికి నెట్టివేయును. వారి చింతల మూలమున, అనేకులు వారి చేతి వేలి గోళ్లను కొరుకుకొనుచుందురు, మెల్లగా నడుచుచుందురు, లేదా వారి ఆలోచనలతో పోరాడుచు రాత్రంతా మేల్కొనే ఉందురు. కొందరు పొగపీల్చుట, మద్యం సేవించుట, మరియు మాదక ద్రవ్యములను ఉపయోగించునటువంటి దుర్వ్యసనములకు అలవాటుపడుదురు. చింత, నిశ్చయముగా మనము సమృద్ధియైన జీవితం జీవించకుండా మనలను ఆటంకపరచును.

పదమూడు మొదలుకొని పంతొమ్మిది సంవత్సరముల వయస్కులు మరియు యౌవనులు తరుచుగా అనేక విషయములు గూర్చి – వారి స్నేహితులు, ప్రేయసి ప్రియుడు కలుసుకొను సమయములు మరియు వారి సంబంధములు, విద్యాభ్యాసము, మరియు భవిష్యత్తు గూర్చి చింతించుచుందురు. కొందరు వారి వస్త్రములు గూర్చి చింతించుచుందురు; వారు ఈ మధ్యనే విడుదలైన క్రొత్త క్రొత్త ఫ్యాషన్‌లతో కూడిన దుస్తులు, అందులోను ప్రఖ్యాతిగాంచినవిగా ముద్రవేయబడినవి, ధరించక తప్పదని వారనుకొనుచుందురు; వయోవృద్ధులేమో, వారు యౌవనులుగా అగుపించవలెననియు, యింకా ఎక్కువ కాలం బ్రతుకాలనియు చింతించుచున్నారు. "యౌవనులుగా" నిలిచియుండునట్లు చేయబడు ప్రయాసములు కొంత మేరకు శ్రేష్ఠమైన జీవితమునకు దోహదపడవచ్చును, కానీ వాటి గూర్చే చింతించుట వాస్తవమునకు మన ఆయుష్కాలమును తగ్గించగలదు. చింత, తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీయుచున్నదని అనేక అధ్యయనములు గుర్తించినవి. డా॥ చార్లెస్ హెచ్. మేయొ, తన సహోదరునితో కూడ మేయొ క్లినిక్‌ను వ్యవస్థాపించినవాడు, ఇలా వ్రాయుచున్నాడు, "చింత, రక్త ప్రసరణను, గుండెను, గ్రంథులను, సంపూర్తి నాడీ మండలమును ప్రభావితము చేయును. అతిగా పనులు చేయుటవలన మరణించిన మనిషిని నేనెన్నడైనను చూడలేదు, కానీ సందేహముల మూలమున చనిపోయిన వారిని అనేకులను చూశాను."[18]

---

సూచనలు

[1]Tobit 4:9, 10; *4 Ezra* 6.5; *Testament of Levi* 13.5; *Psalms of Solomon* 9.5; Mishnah *Peah* 1.1. [2]Sirach 29:10, 11 (NRSV). [3]Talmud *Baba Bathra* 11a. [4]J. C. Ryle, *Ryle's Expository Thoughts on the Gospels: Matthew-Mark* (Grand Rapids, Mich.: Zondervan Publishing House, n.d.), 56. [5]R. T. France, *The Gospel According to Matthew*, The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 138-39. [6]See Sirach 14:9. [7]*Testament of Joseph* 14.2; Mishnah *Pesahim* 8.1. [8]Jack P. Lewis, *The Gospel According to Matthew,* Part 1, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 107. [9]Ibid. [10]William Hendriksen, *New Testament Commentary: Exposition of the Gospel According to Matthew* (Grand Rapids, Mich.: Baker Book House, 1973), 349, n. 334.

[11]Michael J. Wilkins, "Matthew," in *Zondervan Illustrated Bible Backgrounds Commentary,* vol. 1, *Matthew, Mark, Luke,* ed. Clinton E. Arnold (Grand Rapids, Mich.: Zondervan, 2002), 48.

[12]Ibid., 49. [13]Talmud *Sotah* 48b. [14]Robert H. Mounce, *Matthew,* New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 1991), 61. [15]Sirach 30:24 (NRSV). [16]Talmud *Sanhedrin* 100b. [17]Talmud *Berakoth* 9b. [18]Quoted in *Worries: Webster's Quotations, Facts and Phrases* (San Diego: Icon Group International, 2008), 8.